సాక్షి చిత్తూరు

శుక్రవారం । 2 । జూన్ । 2023



మారని తీరు. బురదరాజకీయం

నిన్న పూతల పట్టు..నేడు బంగారుపాళెం మండలంలో వైఎస్సార్ సీపీ దళిత ఎమ్మెల్యేను టీడీపీ శ్రేణులు అవమానించారు. - 8లో



బాబు, పవన్ ఏమీ చేయలేరు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని చంద్రబాబు, పవన్ కల్యాణ్ కలిసినా ఎదుర్కోలేరని డిప్యూటీ సీఎం నారాయణస్వామి విమర్శించారు. - 8లో

	గరిష్ఠం	కనిష్ఠం
చిత్తూరు	39	27
తిరుపతి	41	28
తిరుమల	36	24
గూడూరు	43	31
నగరి	41	28

న్యూస్‌రీల్

ఐరాల మండలంలో ఏనుగుల బీభత్సం



ధ్వంసమైన ఫెన్సింగ్

ఐరాల: మండలంలోని గూబలవారిపల్లెలో బుధవారం రాత్రి రైతులు భాగ్యమ్మ, మనోహర్‌కు చెందిన మామిడి తోటలపై ఏనుగులు విరుచుకుపడ్డాయి. మామిడి తోటలకు అమర్చిన ఫెన్సింగ్‌ను ధ్వంసం చేసి మామిడి కాయలను తిని, తొక్కి నాశనం చేశాయి. డ్రిప్ పైపులను తొక్కివేశాయి. గురువారం ఉదయం తోటల వద్దకు వెళ్లిన రైతులు ధ్వంసమైన తోటలను చూసి బావురుమన్నారు. ఏనుగుల దాడిలో సుమారు రూ.50వేల పంట నష్టం వాటిలినట్లు బాధిత రైతులు తెలిపారు.

పలుశాఖల్లో స్థాన చలనం

చిత్తూరు కార్పొరేషన్: జిల్లాలోని పలు శాఖల్లో బదిలీలు జరిగాయి. పలువురు అధికారులకు స్థానం చలనం కలిగింది. ఆర్అండ్‌బీ ఎస్ఈ దేవానందం ఒంగోలుకు బదిలీ అయ్యారు.ఆయన స్థానంలో విజయవాడ చీఫ్ ఇంజినీరింగ్ కార్యాలయ ఎస్ఈ ఉమామహేశ్వరరెడ్డిని నియమించారు. ఆర్అండ్‌బీ డీఈ చలపతి కడపకు బదిలీ కాగా, ఆయన స్థానంలో ఎవరిని నియమించలేదు.

అటవీశాఖలో: పలువురు రేంజర్లను బదిలీ చేస్తూ అటవీశాఖ పీసీసీఎఫ్ మధుసూదన్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. కుప్పం ఎఫ్ఆర్వో మదన్‌మోహన్‌రెడ్డి మదనపల్లెకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో ఎవరినీ నియమించలేదు. కుప్పం డీఆర్వో చంద్రశేఖర్‌రెడ్డికి అదనంగా ఎఫ్ఆర్వో ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. పలమనేరు ఎఫ్ఆర్వో నయింఆలీ కడప రేంజ్‌కు బదిలీకాగా, ఆయన స్థానంలో నంద్యాల్య ఎఫ్ఆర్వో శివన్న రానున్నారు. కార్వేటినగరం ఎఫ్ఆర్వో చంద్రశేఖర్ తిరుపతి సోషల్ ఫారెస్టుకు బదిలీ కాగా, అక్కడ ఉన్న వెంకటసుబ్బయ్య కార్వేటినగరం బదిలీ అయ్యారు. అదే విధంగా జిల్లా పరిధిలో ఎఫ్ఎస్వోలు తొమ్మిదిమంది, జేఏలు ఇద్దరు, ఎఫ్‌బీఓలు 36, ఎబీఓలు 8, ఒక వాచర్, ఆఫీసు సబార్డినేట్లు నలుగురిని జిల్లా పరిధిలో బదిలీ చేస్తూ డీఎఫ్ఓ చైతన్యకుమార్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారు.

ట్రాన్స్‌కో: ఉమ్మడి జిల్లా ట్రాన్స్‌కో పరిధిలో తిరుపతి ఎస్‌పీఎం డీఈ విజయభాస్కర్ ట్రాన్స్‌ఫార్మర్ విభాగానికి బదిలీ అయ్యారు. అక్కడ ఉన్న ప్రభాకరన్ ఎస్‌పీఎంకు వచ్చారు. వీరితో పాటు ఏఈలు ఇద్దరు, జేఈలు ఐదుగురు, సీనియర్ సహాయకులు 13 మంది, జూనియర్ సహాయకులు నలుగురు, ఆఫీసు సబార్డినేట్లు ఎనిమిది మందిని బదిలీ చేస్తూ ఎస్ఈ కృష్ణారెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు.

సెలవులో డీఎంఅండ్‌హెచ్‌ఓ

చిత్తూరు రూరల్: జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి జి.ప్రకాశం గురువారం నుంచి నెల రోజులపాటు సెలవుల్లోకి వెళ్లారు. జిల్లా ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్ రాజశేఖర్‌రెడ్డికి ఇన్‌చార్జి బాధ్యతలను అప్పగించారు. శుక్రవారం ఆయన బాధ్యతలను స్వీకరించనున్నట్లు శాఖ వర్గాలు పేర్కొన్నాయి.

నేటి నుంచి టెన్త్ సప్లిమెంటరీ

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా శుక్రవారం నుంచి పదవ తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఈనెల 10వ తేదీ వరకు పరీక్షలు జరుగుతాయి. జిల్లా వ్యాప్తంగా 28 కేంద్రాలను ఏర్పాటు చేశారు. బాలురు 4,177, బాలికలు 2,808 మంది పరీక్షలు రాయనున్నారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్షలు జరుగుతాయి. కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని, నో మొబైల్ జోన్‌లుగా ప్రకటించినట్లు డీఈవో విజయేంద్రరావు తెలిపారు.

పుంజుకున్న టమాట ధరలు



పలమనేరు మార్కెట్‌కు వచ్చిన టమాటాలు

పలమనేరు: గత నెలగా ఆశించిన ధరలు లేక కుదేలైన టమాట రైతులకు ఊరట లభించింది. రెండు రోజులుగా ధరలు పెరుగుతున్నాయి. పలమనేరు మార్కెట్‌లో గురువారం బాక్స్ (15 కిలోలు) రూ.300 పైగా పలికింది. దీంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ధరల పతనంతో ఈ ప్రాంతంలో చాలామంది రైతులు పంటను కోయకుండా తోటల్లోనే వదిలేసిన విషయం తెలిసిందే. ఇతర ప్రాంతాల్లో సరుకు తగ్గడంతో స్థానిక మార్కెట్‌కు పొరుగు రాష్ట్రాల నుంచి వ్యాపారులు వస్తున్నారు. ఇదే సమయంలో ముఖ్యంగా లోకల్ సరుకు మార్కెట్‌కు ఎక్కువగా వస్తోంది. నెల రోజులపాటు ధరలు ధరలు నిలకడగానే ఉండే అవకాశాలు ఉన్నాయని మండీ వ్యాపారులు అంటున్నారు.

రైతుకు భరోసా!

'రైతుల సంక్షేమమే ధ్యేయం. వ్యవసాయాన్ని పండగ చేయడమే లక్ష్యం. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా గ్రామ స్థాయిలో రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేశాం. రైతులకు అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తున్నాం. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం వరుసగా ఐదో ఏడాదిలో మొదటి విడత రైతు భరోసా..పీఎం కిసాన్ మొత్తాన్ని పంపిణీ చేస్తున్నాం. గ్రామస్థాయిలోనే రైతులకు వ్యవసాయ పరికరాలు, నాణ్యమైన విత్తనాలు, పురుగు మందులు ఇస్తున్నాం. అన్నదాతకు అన్నివేళలా వెన్నుదన్నుగా ఉంటున్నాం..' అని నేతలు పేర్కొన్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో గురువారం రైతు భరోసా నిధుల పంపిణీ కార్యక్రమాన్ని అట్టహాసంగా ప్రారంభించారు.



రైతు భరోసా మెగా చెక్కును పంపిణీ చేస్తున్న మంత్రి పెద్దిరెడ్డి, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

అట్టహాసంగా రైతు భరోసా కార్యక్రమం

- చిత్తూరు జిల్లాలో 2,27,010 మంది రైతులకు లబ్ధి
- రూ.170.84 కోట్ల పంపిణీ
- హర్షం వ్యక్తం చేస్తున్న అన్నదాతలు

సాక్షి, చిత్తూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం రైతు పక్షపాతి అని రాష్ట్ర అటవీ, విద్యుత్, పర్యావరణ, గనులు భూగర్భశాఖ మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ రైతు భరోసా-పీఎం కిసాన్ పథకం ద్వారా 2023 - 2024కు వరసగా ఐదో ఏడాది మొదటి విడత నిధులను గురువారం కర్నూలు జిల్లా, పత్తికొండ నుంచి సీఎం వైఎస్.జగన్ బటన్ నొక్కి ప్రారంభించగా.. అదే సమయంలో ఇక్కడి నాగయ్య కళాక్షేత్రంలో వర్చువల్ విధానంలో వీక్షించేందుకు జిల్లా స్థాయి కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మంత్రి పాల్గొని ప్రసంగించారు. రాష్ట్రంలో 51,10,194 మంది రైతులకు రూ.3923.18 కోట్లు, చిత్తూరు జిల్లాలో 2,27,010 మంది రైతులకు రూ.170.84 కోట్లను ముఖ్యమంత్రి రైతుల బ్యాంకు ఖాతాలకు జమచేసే కార్యక్రమాన్ని ప్రారంభించారన్నారు. గ్రామ స్థాయిలోనే రైతులకు కావాల్సిన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, పంటల బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ, పంటల ఈ- క్రాప్, రాయితీపై వ్యవసాయ యాంత్రీకరణ పరికరాలు పంపిణీ చేస్తున్నట్టు తెలిపారు. కలెక్టర్ సగిలి షణ్మోహన్ మాట్లాడుతూ రైతులకు అందించే ఆర్థిక సహాయంలో సమస్యలుంటే సంబంధిత రైతులు రైతు భరోసా కేంద్రాల్లోనూ, స్పందన కార్యక్రమంలోనూ ఫిర్యాదు చేయొచ్చని చెప్పారు. జిల్లా వ్యవసాయ శాఖ సలహా మండలి అధ్యక్షులు రామచంద్రారెడ్డి మాట్లాడుతూ సమయానికి రైతులకు పెట్టుబడి కింద నిధులను విడుదల చేసి రైతులను ఆదుకుంటున్నారన్నారు. అంతకుముందు వ్యవసాయశాఖ అనుబంధ శాఖలు ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను మంత్రి, కలెక్టర్ పరిశీలించారు. స్థానిక ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, జేసీ పి.శ్రీనివాసులు, రాష్ట్ర మొదలియార్ కార్పొరేషన్ చైర్మన్ బుల్లెట్ సురేష్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ రాయలసీమ జోనల్ చైర్మన్ శైలజారెడ్డి, చిత్తూరు నగర మేయర్ ఆముద, స్త్రీ శిశు సంక్షేమ శాఖ జెడ్పీ స్టాండింగ్ కమిటీ చైర్‌పర్సన్ భారతి పాల్గొన్నారు.

ఆర్బీకేలు అద్భుతం



మెగా చెక్కును పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యేలు ఆదిమూలం, కిలివేటి, కలెక్టర్ వెంకటరమణారెడ్డి

తడ: నాడు విత్తనాలు, ఎరువులు, భూసార పరీక్షలకు రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారని, నేడు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన రైతుభరోసా కేంద్రాలు (ఆర్బీకేలు) ఎంతో ఉపశమనం కలిగిస్తున్నాయని కలెక్టర్ వెంకటరమణారెడ్డి తెలిపారు. తిరుపతి జిల్లా రైతు భరోసా పంపిణీ కార్యక్రమాన్ని స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమీపంలోని ఓ ప్రయివేటు హోటల్‌లో నిర్వహించగా.. దీనికి సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అధ్యక్షత వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతుల అభ్యున్నతి కోసం తపన పడే నాయకుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. ఉత్తుత్తి హామీలు ఇచ్చి పదవి దక్కగానే అన్నీ గాలికి వదిలేసే తత్వం చంద్రబాబుదన్నారు. సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం మాట్లాడుతూ రైతులకే కాకుండా కుల, మతాలకు అతీతంగా పార్టీలతో పనిలేకుండా ప్రతి ఒక్కరికీ మేలు చేకూర్చేలా జగనన్న పాలన సాగుతోందన్నారు. జిల్లా వ్యవసాయశాఖ జేడీ ఎస్.ప్రసాద్, సూళ్లూరుపేట ఆర్డీఓ చంద్రముని, ఎన్‌డీసీసీ బ్యాంక్ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి, చెంగాళమ్మ ఆలయ చైర్మన్ దువ్వూరు బాలచంద్రారెడ్డి, తడ జెడ్పీటీసీ సభ్యులు ఇందుమతి కార్తీక్, తడ, నాయుడుపేట ఎంపీపీలు కే రఘురెడ్డి, కే ధనలక్ష్మి, డీసీఎంఎస్ డైరెక్టర్ గందవరం సురేష్‌రెడ్డి, తడ, తడకండ్రిగ సర్పంచ్‌లు కే ఆర్ముగం, తుమ్మాజయప్రద, నాయకులు కామిరెడ్డి రాజారెడ్డి, గోపాల్‌రెడ్డి, జెట్టి వేణుయాదవ్, ఎం మునీష్‌రెడ్డి, కే మాధవరెడ్డి, కోదండం, ఆర్‌కే సుందర్‌రెడ్డి, మునిరత్నంరెడ్డి, దేవేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

చెక్కుల పంపిణీ

మార్చి, ఏప్రిల్, మే నెలల్లో వర్షాలకు పంటలు దెబ్బతిన్న 1,110 మంది రైతులకు రూ.66.52 లక్షల మెగా చెక్కును, జిల్లాకు సంబంధించి రైతు భరోసా - పీఎం కిసాన్ పథకానికి అర్హులైన 2,27,010 మంది రైతులకు రూ.170.84 కోట్లు మెగా చెక్కును మీదుగా అందజేశారు. అలాగే జిల్లా అటవీ శాఖలో పనిచేసి మరణించిన ఏడుగురికి ఆయా కుటుంబాలకు జిల్లా అటవీశాఖ ద్వారా ఫారెస్ట్ బినేవాలెంట్ ఫండ్ కింద ఒక్కొక్కరికీ రూ.25 వేల చొప్పున రూ.1.75 లక్షలు పంపిణీ చేశారు.

గతంలో నగానట్రా తాకట్టు పెట్టేవాళ్లం



గతంలో పెట్టుబడి కోసం బంగారం తాకట్టు పెట్టేవాళం. అధిక వడ్డీలకు తెచ్చి వ్యవసాయం చేసేవాళ్లం. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక రైతులకు వ్యవసాయం పండగగా మారింది. నాకు ఇప్పటి వరకు రూ.2,64,460 అందింది.

– పద్మావతి, మహిళారైతు, యాదమరి మండలం

మళ్లీ జగనే సీఎం



పాదయాత్రలో జగన్ రైతుల కష్టాలు చూసి అధికారంలోకి వచ్చాక వారికి మేలు చేస్తానని మాట ఇచ్చారు. ఆ మాటకు కట్టుబడి ఎన్ని ఇబ్బందులు ఉన్నా ప్రతి సంవత్సరం రైతు భరోసా అందిస్తున్నారు. మాకు ఇప్పటికే రూ.54 వేలు వచ్చింది. ఈరోజు మళ్లీ రూ.7,500 వస్తుంది. మళ్లీ జగనే సీఎం.

– జయమ్మ, మహిళారైతు, కమ్మపల్లి

వ్యవసాయం లాభసాటి



జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక రైతులకు వ్యవసాయ లాభం సాటిగా మారింది. వ్యవసాయానికి పగటి పూట 9 గంటలు విద్యుత్ ఇవ్వడం, వ్యవసాయానికి పెట్టుబడిగా మే నెలలో రూ.7,500 ,అక్టోబర్‌లో మరో రూ.4 వేలు, జనవరిలో రూ.2 వేలు ఇవ్వడం చాలా సంతోషాన్నిస్తోంది. జగన్‌మోహన్ రెడ్డే పది కాలాలపాటు ముఖ్యమంత్రిగా ఉండాలి.

– ప్రతాప్‌రెడ్డి, చెర్లోపల్లి, చిత్తూరు మండలం



జిల్లా అటవీ శాఖలో పనిచేసి మరణించిన వారి కుటుంబాలకు చెక్కులు పంపిణీ చేస్తున్న మంత్రి పెద్దిరెడ్డి, పక్కన ఎమ్మెల్యే ఆరణి, కలెక్టర్ సగిలి షణ్మోహన్, డీఎఫ్‌వో



స్టాల్స్ పరిశీలిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, కలెక్టర్, డీఎఫ్‌వో

పుష్ప పల్లకిలో ఇంద్రవరదుని విహారం



పుష్పపల్లకి ఊరేగింపు



పల్లకిలో దేవదేవేరులు

యాదమరి: మండల కేంద్రంలోని శ్రీఇంద్రవరద రాజస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలలో భాగంగా గురువారం శ్రీదేవి, భూదేవి సమేతంగా స్వామి వారు పుష్పపల్లకిలో పురవీధుల్లో విహరించారు. వేకువజామున ఆలయంలో మూలమూర్తులకు ప్రత్యేక పూజలు జరిగాయి. తర్వాత కల్యాణ వేదికలో ఉత్సవమూర్తులను కొలువుదీర్చి ప్రత్యేక అభిషేక పూజలు, అలంకరణలు చేశారు. తదుపరి సర్వాంగ సుందరంగా అలంకరించిన పుష్పపల్లకిలో కొలువుదీర్చారు. సాంస్కృతిక ప్రదర్శనలు, మంగళ వాయిద్యాలు, మేళ తాళాలు, బాణసంచా పేలుళ్ల సందడి నడుమ పురవీధుల్లో పుష్పపల్లకి ఊరేగింపు నయనానందకరంగా సాగింది. భక్తులు కర్పూర నీరాజనాలు సమర్పించారు.

వేడుకగా పవళింపు సేవ

గురువారం రాత్రి స్వామివారికి వడయాత్తు ఉత్సవంలో భాగంగా పవలింప సేవ వేడుకగా నిర్వహించారు. పన్నెండు రోజుల పాటు పలు వాహనాల్లో విహరించి అలసిపోయిన స్వామి, అమ్మవార్లకు చివరి రోజు పవలింప సేవ నిర్వహించారు. భక్తులు లాలి పాటలు ఆలపించారు.

జగనన్న పాలనలోనే కుప్పం అభివృద్ధి

- చంద్రబాబుకు తగిన బుద్ధి చెప్పాలి
- కుప్పంపై ముఖ్యమంత్రి ప్రత్యేక దృష్టి
- గడప గడపకు మన ప్రభుత్వంలో ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్సీ భరత్



సంక్షేమ బావుటా బుక్‌లెట్ అందిస్తున్న ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్సీ భరత్

రామకుప్పం: 'వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాతనే కుప్పం నియోజకవర్గంలో అభివృద్ధి సాధ్యమైంది.. నియోజకవర్గ అభివృద్ధిపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించి, కోరినన్ని నిధులు కేటాయిస్తున్నారు.. అమలుకు వీలుకాని హామీలిచ్చి ప్రజలను మోసం చేసే చంద్రబాబుకు రానున్న ఎన్నికల్లో ప్రజలు తగిన రీతిలో బుద్ధి చెప్పాలి' అని చిత్తూరు ఎంపీ రెడ్డెప్ప అన్నారు. గురువారం మండలంలోని బందార్లపల్లె పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్సీ భరత్‌తో కలసి ఎంపీ పాల్గొన్నారు. వారు ఇంటింటికీ వెళ్లి జగన్‌మోహన్ రెడ్డి ఎన్నికల ముందు ఇచ్చిన హామీల్లో 98శాతం అమలు చేశారని వివరించారు. అమ్మఒడి, వైఎస్సార్ ఆసరా, చేయూత, రైతు భరోసా, వైఎస్సార్ పింఛన్, విద్యాదీవెన తదితర పథకాల ద్వారా పొందిన లబ్ధిని లబ్ధిదారులకు వివరించారు. ఇచ్చిన హామీలను నెరవేర్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందని తెలిపారు. జగనన్న పాలనలో మహిళలు ఆర్థికంగా ఎదిగి తమ కుటుంబాలను ఉన్నతస్థాయికి తీసుకుని రావడంలో కీలకపాత్ర పోషిస్తున్నారని తెలిపారు. నవరత్నాల కార్యక్రమం ద్వారా మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారన్నారు. సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా రాష్ట్రాభివృద్ధి కోసం ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అహర్నిశలు కష్టపడుతున్నారని తెలిపారు. కుప్పం అభివృద్ధికి వైఎస్సార్ సీపీ కట్టుబడి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ విజలాపురం బాబురెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు నితిన్ రెడ్డి, ఎంపీపీ సుబ్రమణ్యం, పార్టీ కో కన్వీనర్ చంద్రారెడ్డి, సర్పంచ్ రాజ్‌గోపాల్, ఎంపీటీసీ సభ్యురాలు సౌమ్య, ప్రచార కార్యదర్శి కేశవరెడ్డి, నేతలు రామకృష్ణారెడ్డి, సురేంద్రరెడ్డి, శ్రీనివాసులు రెడ్డి,నరేంద్ర రెడ్డి,నాగరాజు రెడ్డి, శ్రీవర్ధన్, వార్డుసభ్యులు పాల్గొన్నారు.

బదిలీలకు 8,784 మంది దరఖాస్తు

- పకడ్బందీగా టీచర్ల బదిలీల కసరత్తు
- 4న వెబ్‌సైట్‌లో ఖాళీల ప్రకటన

చిత్తూరు కలెక్టరేట్ : అయ్యోర్ల బదిలీల పర్వం పకడ్బందీగా కొనసాగుతోంది. ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా 66 మండలాల ప్రకారం బదిలీల కసరత్తు నిర్వహిస్తున్నారు. తిరుపతి, అన్నమయ్య జిల్లాల డీఈవోల సమన్వయంతో కసరత్తు చేపడుతున్నారు. రాష్ట్ర విద్యాశాఖ అధికారులు జారీచేసిన బదిలీల షెడ్యూల్ ప్రకారం చిత్తూరు జిల్లా విద్యాశాఖ అధికారులు ప్రక్రియ చేపడుతున్నారు. బదిలీల ప్రక్రియ కొనసాగుతుండడంతో డీఈవో కార్యాలయంలో టీచర్ల సందడి వాతావరణం కనిపిస్తోంది. ఎలాంటి పొరబాట్లకు తావివ్వకుండా ప్రక్రియను డీఈవో విజయేంద్రరావు, ఏడీ వెంకటేశ్వర్, చిత్తూరు డీవైఈవో చంద్రశేఖర్‌లు పర్యవేక్షిస్తున్నారు.

విధుల్లో 14,950 మంది అయ్యోర్లు

ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా సర్కారు బడుల్లో అన్ని కేడర్‌లలో 14,950 మంది టీచర్లు విధులు నిర్వహిస్తున్నట్లు విద్యాశాఖ నివేదికలు వెల్లడిస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం జారీచేసిన బదిలీల ఉత్తర్వుల మేరకు టీచర్లు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకున్నారు. 8,784 మంది టీచర్లు బదిలీలకు దరఖాస్తులు చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. అందులో 2,486 మంది ఐదు సంవత్సరాలు పూర్తి అయిన వారు, 6,298 మంది రిక్వెస్ట్ బదిలీలకు దరఖాస్తులు చేసుకున్నారు. ఈ కసరత్తులో షెడ్యూల్ మేరకు గత నెల 30 వ తేదీన టీచర్ల నుంచి లిఖిత పూర్వక అభ్యంతరాలకు అవకాశం కల్పించారు. 500 కు పైగా టీచర్లు అభ్యంతరాలను వెల్లడించగా, వాటిని గత నెల 31, ఈ నెల 1 వ తేదీన క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించినట్లు జిల్లా విద్యాశాఖ అధికారులు తెలిపారు. తదుపరి ఈనెల 2,3 తేదీల్లో తుది సీనియారిటీ జాబితా పాయింట్ల ప్రకారం ప్రచురిస్తారు. 4వ తేదీన వెబ్‌సైట్‌లో ఖాళీలను ప్రచురించనున్నారు. హెడ్‌మాస్టర్‌లు ఈ నెల 5, 6 తేదీల్లో, స్కూల్ అసిస్టెంట్‌లు 5 నుంచి 7 తేదీల వరకు, ఎస్జీటీలు 5 నుంచి 8 వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో వెబ్ ఆప్షన్‌లు నమోదు చేసుకోవచ్చు. ఆ తర్వాత ఈనెల 9 వ తేదీ నుంచి 11 వ తేదీ వరకు కేడర్‌ల వారీగా ఆన్‌లైన్‌లో బదిలీ అయిన టీచర్ల జాబితాలను ప్రచురించనున్నారు. ఈనెల 12 వ తేదీన పాఠశాలలు పునఃప్రారంభించే రోజు బదిలీ అయిన టీచర్లు నూతన పాఠశాలల్లో విధుల్లో చేరనున్నారు.



చిత్తూరు డీఈఓ కార్యాలయం

క్లుప్తంగా

వినాయకుని సేవలో ప్రముఖులు



ఎమ్మెల్యే రఘురామిరెడ్డికి చిత్రపటం అందిస్తున్న ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి

కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామిని గురువారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వైఎస్సార్ జిల్లా మైదుకూరు శాసనసభ్యుడు శెట్టిపల్లె రఘురామిరెడ్డి, రాష్ట్ర ప్రాసిక్యూషన్ డైరెక్టర్ సుదర్శన్ రెడ్డి కుటుంబ సమేతంగా వేర్వేరుగా స్వామివారి దర్శనార్థం విచ్చేశారు. ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు స్వాగతం పలికి, ప్రత్యేక దర్శనం కల్పించారు. అనంతరం వేదపండితులచే ఆశీర్వచనం అందించి తీర్థ ప్రసాదాలు, చిత్రపటం అందించారు.

ఏబీసీడబ్ల్యూఓగా వాసంతి

చిత్తూరు కలెక్టరేట్ : చిత్తూరు అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ ఆఫీసర్‌గా వాసంతి నియమితులయ్యారు. సాధారణ బదిలీల్లో ఆమెను చిత్తూరుకు నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వైఎస్సార్ కడప జిల్లా పులివెందుల నుంచి ఇక్కడికి వస్తున్నారు. ఇక్కడ పనిచేస్తున్న జ్యోత్స్న తిరుపతి జిల్లా తిరుపతి అర్బన్ ఏబీసీడబ్ల్యూవోగా బదిలీ అయ్యారు. వీరు త్వరలో నూతన స్థానాల్లో బాధ్యతలు స్వీకరించనున్నారు.

మారని పచ్చ నేతల తీరు..

మళ్లీ బురద రాజకీయం

- నిన్న పూతలపట్టు, నేడు బంగారుపాళ్యం మండలంలో..
- మరోసారి దళిత ఎమ్మెల్యేను అవమానించిన టీడీపీ శ్రేణులు
- పథకాల లబ్ధి పొందుతూనే 'పచ్చ నీచ రాజకీయం'
- సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి లభిస్తున్న ఆదరణను జీర్ణించుకోలేకే తాళాలు



గొల్లపల్లెలో తాళం వేసిన టీడీపీ మద్దతుదారుడి ఇల్లు

యాదమరి(పూతలపట్టు): నిన్న పూతల పట్టు..నేడు బంగారుపాళెం మండలంలో వైఎస్సార్ సీపీ దళిత ఎమ్మెల్యేను తెలుగుదేశం శ్రేణులు కులాన్ని చూపుతూ నీచ రాజకీయంతో అవమానించారు. ప్రభుత్వ పథకాలు అందాయా.. సమస్యలు ఏమైనా ఉన్నాయా అని తెలుసుకునేందుకు పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా పూతలపట్టు మండలం గుంతూరు గ్రామ సచివాలయం పరిధిలోని 170 గొల్లపల్లెలో పర్యటించారు. ఎమ్మెల్యే వస్తారని ముందుగానే సమాచారం అందుకున్న టీడీపీ నాయకులు పథకాలు అన్ని తీసుకున్నా ఇళ్లకు తాళాలు వేసుకుని వెళ్లారు. నాలుగు సంవత్సరాలుగా టీడీపీ నాయకులు అన్ని పథకాల లబ్ధి పొందుతున్నా.. ఎన్నికలు రానుండడంతో ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాలు జరగలేదని ప్రజల్లోకి తప్పుడు ప్రచారం పంపేందుకు కుట్ర రాజకీయాలు చేస్తూ నియోజక వర్గంలో నిన్న పూతలపట్టు మండలం పేట అగ్రహారంలో, నేడు 170 గొల్లపల్లెలో ఇళ్లకు తాళాలు వేసి తమ నీచనైజాన్ని చాటారు.

తీసుకున్న పథకాలు చెప్పుకోలేక..

గతంలో ఎమ్మెల్యేలు ఎన్నికల సమయంలో మాత్రమే గ్రామాల్లోకి వచ్చేవారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తరువాత ప్రభుత్వం అందిస్తున్న పథకాలు ప్రజలకు అందుతున్నాయా లేదా.. సమస్యలు ఏమైనా ఉన్నాయా.. ఉంటే వెంటనే అధికారులతో మాట్లాడి పరిష్కరించాలని గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రతి గడపకు ఎమ్మెల్యే, నాయకులు వస్తున్నారు. ఇది జీర్ణించుకోలేని టీడీపీ నాయకులు తీసుకున్న పథకాలు చెప్పుకోలేక ఇళ్లకు తాళాలు వేసి వెళ్లి పోవడం ఎంత వరకు న్యాయమోనని ప్రజలు బాహాటంగా విమర్శిస్తున్నారు.

రూ.44 కోట్లు పంపిణీ

పూతలపట్టు నియోజక వర్గంలో రాష్ట్ర ప్రభుత్వంపై పచ్చ నేతలు బురద చల్లేందుకు ప్రయత్నిస్తున్న గ్రామాల ప్రజలకు నవరత్నాల ద్వారా రూ.44 కోట్లు విలువజేసే వివిధ పథకాలను అందించారు. పథకాలు అందుకున్నా వైఎస్సార్‌సీపీపై బురదజల్లేందుకే ఇళ్లకు తాళాలు వేసి వెళ్లారని గ్రామస్తులు విమర్శించడం కనిపించింది.టీడీపీ మాయలో తాము పడమని, అన్నీ గమనిస్తున్నామని గ్రామస్తులు స్పష్టం చేశారు.

బయట తాళం వేసి ఇంట్లోనే టీడీపీ సర్పంచ్

పచ్చనీచ రాజకీయంలో టీడీపీ నేత, సర్పంచ్ ప్రకాష్‌నాయుడు తడఖా చూపించారు. 'గడప గడపకు కార్యక్రమానికి ఎమ్మెల్యే మన పంచాయతీకి వస్తారు. ఎవ్వరూ ఇళ్లలో ఉండద్దు. ఇళ్లకు బీగాలు వేయండి' అని పార్టీ సాను భూతిపరులకు హుకుం జారీ చేశారు. సర్పంచ్ సహా వంద కుటుంబాల వారు ఇళ్లకు తాళాలు వేసి వెళ్లి పోయారు. బుధవారం రాత్రే గ్రామాల్లోని వీధుల్లో టీడీపీ జెండాలను విద్యుత్ స్తంభాలు, ఇళ్ల వద్ద ఏర్పాటు చేయించారు. ఎమ్మెల్యే ఎంఎస్ బాబు కార్యక్రమంలో భాగంగా సర్పంచ్ ప్రకాష్‌నాయుడు ఇంటి వద్దకు వెళ్లారు. తాళం వేసి ఉండడంతో ఆయనకు ఫోన్ చేసినా లిఫ్ట్ చేయలేదు. ఆయన ఆసమయంలో ఇంటి ముందు తలుపునకు తాళం వేసి పెరట్లో ఉన్నారు. మండల సమావేశాల్లో మా పంచాయతీలో ఈ సమస్య ఉంది, ఆ సమస్య ఉందని ధ్వజమెత్తే సర్పంచ్ అవి తెలియజేయకుండా ఎందుకు ఇంటికి బీగాలు వేసుకున్నారో...అని ఎమ్మెల్యే అన్నారు. సర్పంచ్, ఎంపీటీసీ సభ్యుడు టీడీపీ మద్దతుదారులే కాబట్టి ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమంపై బురదచల్లే ప్రయత్నాలు సాగించారు. అనంతరం ఇళ్లల్లో ఉన్న వారి వద్దకు ఎమ్మెల్యే వెళ్లి ప్రభుత్వం ద్వారా పొందిన లబ్ధిని వివరించారు. సమస్యలు ఎమైనా ఉన్నాయా అంటూ ప్రజలను అడిగి తెలుసుకున్నారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ముగిసిన తరువాత ఎమ్మెల్యే బాబు స్థానిక వైఎస్సార్ సీపీ నాయకుడు లోకేష్ ఆధ్వర్యంలో 170 గొల్లపల్లెలో వైఎస్‌ఆర్‌సీపీ జెండా ఆవిష్కరించారు.

పార్టీలకతీతంగా పథకాల అమలు

బంగారుపాళెం: పార్టీలకతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు తెలిపారు. మండలంలోని 170 గొల్లపల్లె పంచాయతీ జయరామపురం, ఎర్రావాండ్లపల్లె, 170 గొల్లపల్లె, దళితవాడ, బంగిడిమిట్ట గ్రామాల్లో గురువారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నిర్వహించారు. పంచాయతీ పరిధిలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ముగిసిన తరువాత ఎమ్మెల్యే బాబు స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుడు లోకేష్ ఆధ్వర్యంలో 170 గొల్లపల్లెలో వైఎస్సార్‌సీపీ జెండా ఆవిష్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ, సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రాష్ట్రంలో ప్రజా సంక్షేమానికి పాటుపడుతున్నారన్నారు. పార్టీలకు, కులమతాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలకు ప్రభుత్వ పథకాలు అందుతున్నాయన్నారు. ప్రజారంజక పాలన సాగిస్తున్న ప్రభుత్వంపైన, సీఎం జగన్‌మోహన్‌రెడ్డిపై టీడీపీ నాయకులు చేస్తున్న ఆరోపణలను ఖండించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ రామచంద్రారెడ్డి, ఎంపీపీ అమరావతి, వైస్ ఎంపీపీ శిరీష్‌రెడ్డి, జెడ్పీటీసీ సోమశేఖర్, పార్టీ జిల్లా కార్యదర్శులు శరత్‌రెడ్డి, దొరస్వామి, జిల్లా సేవాదల్ అధ్యక్షుడు కిషోర్‌కుమార్‌రెడ్డి, జిల్లా యూత్ ఉపాధ్యక్షుడు మహేంద్ర, వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ మొగిలీశ్వర, పలువురు సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, తహసీల్దార్ బెన్నురాజ్, ఎంపీడీఓ హరిప్రసాద్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



ఎర్రాండ్లపల్లెలో మహిళకు ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్ బాబు

నేడు, రేపు రాష్ట్రస్థాయి వర్క్‌షాప్

చిత్తూరు కలెక్టరేట్ : ఉపాధ్యాయ బదిలీల కసరత్తులో పాల్గొంటున్న డీఈవో కార్యాలయ అధికారులు, సిబ్బందికి శుక్ర, శనివారాలు రాష్ట్రస్థాయిలో వర్క్‌షాప్ నిర్వహించనున్నారు. ఈ మేరకు రాష్ట్ర విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ మువ్వా రామలింగం పంపిన ఉత్తర్వులు గురువారం జిల్లా విద్యాశాఖ కార్యాలయానికి అందాయి. బదిలీల కసరత్తులో పాల్గొంటున్న ఏడీ సర్వీసెస్, సూపరింటెండెంట్, ఏఎస్‌వో, ఏపీవోలు వర్క్‌షాప్‌కు కచ్చితంగా హాజరుకావాలని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

హత్య కేసులో నిందితుడి అరెస్ట్

పలమనేరు: ఆన్‌లైన్ లూడో గేమ్ ఆడుతూ వచ్చిన తగాదా కారణంగా వెస్ట్‌బెంగాల్‌కు చెందిన దయాల్‌సర్కార్‌ను హతమార్చిన కేసులో నిందితుడిని పలమనేరు పోలీసులు గురువారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. అర్బన్ సీఐ చంద్రశేఖర్ కథనం మేరకు.. వెస్ట్‌బెంగాల్ రాష్ట్రం ముషీరాబాద్ జిల్లా బిల్బోర క్ర మండలం దిగ్గల్ కండి గ్రామానికి చెందిన మహ్మద్ రోని ఇస్లాంను స్థానిక పోలీసులు జిల్లా కేంద్రంలోని రైల్వే స్టేషన్ వద్ద గురువారం అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా దయాల్ సర్కార్ పిలిస్తేనే తాను ఇక్కడికి పనులకు వచ్చానని నిందితుడు పోలీసులకు తెలిపాడు. పనులు ముగించుకుని రాత్రిపూట లూడో గేమ్ ఆడేవాళ్లమని పేర్కొన్నాడు. ఆరోజు గేమ్‌లో తొండి చేయడంతోనే తాను ఇనుప రాడ్డుతో కొట్టినట్టు నేరాన్ని అంగీకరించాడు. సెల్ ఫోన్ టవర్ ఆధారంగా అందిన సమాచారం మేరకు నిందితుడిని చిత్తూరులో అరెస్ట్ చేశారు. స్థానిక కోర్టు వద్ద దాచిన ఇనుపరాడ్డును సీజ్ చేసి, గురువారం కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు. 24 గంటల్లో నిందితుడిని అరెస్ట్ చేసిన సీఐ, క్రైమ్‌పార్టీని డీఎస్పీ సుధాకర్ రెడ్డి అభినందించారు.

చిన్న శేషుడిపై ప్రసన్నుడి వైభవం



చిన్న శేషవాహనంపై ప్రసన్న వేంకటేశ్వరుడు



హంస వాహనంపై విహరిస్తున్న గోవిందుడు

వడమాలపేట : అప్పలాయగుంటలో టీటీడీ అనుబంధంలో ఉన్న ప్రముఖ శ్రీప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో రెండవ రోజు ఉదయం శ్రీవేణుగోపాలస్వామి అలంకరణలో చిన్న శేష వాహనంపై విహరిస్తూ స్వామివారు అభయమిచ్చారు. ఉదయం సుప్రభాత సేవతో స్వామి వారిని మేల్కొలిపి విశ్వరూప దర్శనం, తోమాల సేవ, కొలువు, అర్చన తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులను దర్శనానికి అనుమతించారు. ఉదయం ఎనిమిది గంటలకు స్వామి వారిని సర్వాంగ సుందరంగా అలంకరించి శేషవాహనంపై కొలువుదీర్చారు. వేదమంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాలు నడుమ చిన్నశేష వాహనంపై స్వామివారు మాడ వీధుల్లో విహరిస్తూ భక్తులను కటాక్షించారు. సాయంత్రం 6.30 నుంచి 7.30 వరకు ఊంజల్‌సేవ నేత్రపర్వంగా సాగింది. రాత్రి గోవిందుడు హంసవాహనంపై విహరిస్తూ భక్తుల నీరాజనాలు అందుకున్నారు.

బాలల హక్కులను పరిరక్షించాలి



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి కరుణకుమార్

చిత్తూరు అర్బన్: బాలల హక్కులను పరిరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందని జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి, జిల్లా సీనియర్ సివిల్ జడ్జి డాక్టర్ ఐ. కరుణకుమార్ అన్నారు. నగరంలోని జిల్లా కోర్టులోని తన కార్యాలయంలో గురువారం మీడియా సమావేశంలో జడ్జి మాట్లాడారు. ఉమ్మడి జిల్లాలో గురువారం నుంచి ఈనెల 30వ తేదీ వరకు బాల కార్మిక నిర్మూలన, సంరక్షణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కుటుంబ పరిస్థితుల నేపథ్యంలో బాలలు దారి తప్పుతుంటా రన్నారు. ఇంట్లో నుంచి పారిపోవడం, దొంగతనాలకు పాల్పడడం, చదువుపై నిరాశతో పనుల్లో చేరడం సమాజంలో తరచూ జరుగుతుంటాయని చెప్పారు. ఇవన్నీ చట్ట వ్యతిరేకమైన చర్యలన్నారు. ఇలాంటి వాటిని గమనిస్తే..సామాజిక స్పృహతో వెంటనే అధికారుల దృష్టికి తీసుకోరావాలన్నారు. బాలల హక్కులను పరిరక్షణకు అందరూ నడుంబిగించాలని సూచించారు. ఈ సామాజిక రుగ్మతులన్నీ నిర్మూలించే దిశగా ప్రభుత్వం ప్రయత్నం చేస్తోందన్నారు. నెల రోజుల పాటు అవగాహన ర్యాలీలు, సదస్సులు నిర్వహించి ప్రజల్లో చైతన్యం తీసుకు రానున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొనాలని ఆయన తెలిపారు.

బాబు, పవన్ కలిసినా ఏమీ చేయలేరు



పథకాల లబ్ధిని తెలుసుకుంటున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి

పాలసముద్రం : బడుగు, బలహీన వర్గాల ఆశీస్సులు ఉన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని ప్రతిపక్ష నేత, వెన్నుపోటు చంద్రబాబునాయుడు, జనసేన అధినేత పవన్ కల్యాణ్ లాంటి వారు ఎంత మంది కలిసినా రానున్న ఎన్నికల్లో ఎదుర్కోలేరని డిప్యూటీ సీఎం కే. నారాయణస్వామి విమర్శించారు. గురువారం మండలంలోని ఆముదాలలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా రైతు భరోసా కేంద్రం ఆవరణలో సబ్సిడీ వేరుశగన విత్తన కాయలను డిప్యూటీ సీఎం పంపిణీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు మెరుగైన సేవలు అందిస్తోందని తెలిపారు. అన్నదాలకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులతో పాటు సకాలంలో అన్ని సేవలు గ్రామాల్లోనే అందుతుండడంతో రైతులు సంతోషంగా ఉన్నారని పేర్కొన్నారు. రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజల ఆశీస్సులు మెండుగా ఉన్నాయన్నారు. చంద్రబాబు, పవన్ కల్యాణ లాంటి వారు ఎంత మంది కలసినా రానున్న ఎన్నికల్లో గెలుపు వైఎస్సార్ సీపీదేనని స్పష్టం చేశారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో 32 లక్షల మంది పేదల సొంతింటి కలను సాకారం చేస్తుంటే, ప్రతిపక్ష నేత చంద్రబాబు ఓర్వలేక ఆ ఇంటి స్థలం శవం పూడ్చడానికి కూడా చాలదంటూ అనుచిత వ్యాఖ్యలు చేయడం బాధాకరమని తెలిపారు. ఎన్నికల మేనిఫెస్టోలో 25 లక్షల మందికి ఇళ్ల స్థలాల ఇస్తామని హామీ ఇచ్చి 32 లక్షల మందికి అందించిన ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని తెలిపారు. టీడీపీ భూస్థాపితం అవుతుందన్న భయంతో చంద్రబాబు పేదల స్థలాలను శ్మశాన వాటికతో పోలుస్తున్నారని నారాయణస్వామి పేర్కొన్నారు.



చిత్తూరు బులియన్

బంగారం :	
24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.62,350
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,500
వెండి:	
హోల్‌సేల్ ధర (కిలో)	రూ.72,000
రిటైల్ వెండి గ్రాము	రూ.74

నేడు, రేపు ప్రిన్సిపల్ సెక్రటరీ పర్యటన

చిత్తూరు కలెక్టరేట్ : రాష్ట్ర విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ శుక్ర, శనివారాల్లో చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో పర్యటించనున్నారని విద్యాశాఖ అధికారులు వెల్లడించారు. క్షేత్రస్థాయిలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న విద్యాసంక్షేమ కార్యక్రమాలు, రానున్న విద్యాసంవత్సరానికి పంపిణీ చేసే జగనన్న విద్యాకానుక, నాడు-నేడు పనుల పురోగతిని పరిశీలించనున్నారని తెలిపారు.

కాణిపాకం ఆలయంలో ఐదుగురు బదిలీ

కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి ఆలయంలో ఐదుగురు ఉద్యోగులను దేవదాయ శాఖ బదిలీ చేసింది. సూపరింటెండెంట్ కోదండపాణి శ్రీకాళహస్తీశ్వరస్వామి ఆలయానికి, మరో సూపరింటెండెంట్ శ్రీధర్‌బాబు మహానంది లోని మహానందీశ్వర స్వామి ఆలయానికి, జూనియర్ అసిస్టెంట్‌లు సంతానం, బాలాజీ నాయుడు, మునిరత్నం శ్రీశైలం మల్లికార్జున స్వామి ఆలయానికి బదిలీ అయ్యారు. జూనియర్ అసిస్టెంట్‌లు శ్రీశైలం ఆలయం నుంచి శ్రీనివాసులు, శ్రీ కాళహస్తీశ్వరస్వామి ఆలయం నుంచి లక్ష్మయ్య, నెట్టికంటి ఆంజనేయస్వామి ఆలయం నుంచి నాగేశ్వర్ రెడ్డి కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామి ఆలయానికి రానున్నారు.

ఖజానా శాఖలో ముగ్గురు బదిలీ

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా ఖజాన శాఖలో ముగ్గురు ఉద్యోగులు బదిలీ అయ్యారు. సాధారణ బదిలీల్లో భాగంగా నిబంధనలను అనుసరించి దరఖాస్తు చేసుకున్న ఉద్యోగులను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. చిత్తూరు జిల్లా పరిధిలో పనిచేస్తున్న ఇద్దరు సీనియర్ అసిస్టెంట్లను, ఒక జూనియర్ అసిస్టెంట్‌ను బదిలీ చేస్తూ ఖజాన శాఖ డీడీ రామచంద్రా ఉత్తర్వులు జారీ చేశారు.

క్షుద్ర పూజల కలకలం



క్షుద్ర పూజలు చేసిన ఆనవాళ్లు

శ్రీరంగరాజపురం: అటవీ ప్రాంతంలో గుర్తు తెలియని వ్యక్తులు చేసిన క్షుద్ర పూజలు స్థానికంగా కలకలం రేపుతున్నాయి. స్థానికుల కథనం మేరకు.... మండలంలోని మర్రిపల్లె-మంగుంట మార్గమధ్యలో మూలూరు చెరువు ఉంది. చెరువుకు ఆనుకుని అటవీ ప్రాంతంలో కొందరు క్షుద్ర పూజలు చేసినట్లు స్థానికులు గుర్తించారు. సంఘటన స్థలం వద్ద రక్తపు మరకలు, నిమ్మకాయలు, పసుపు, కుంకుమ, గుమ్మడి కాయలతో పూజలు చేసి ఉండడాన్ని గుర్తించారు. ఎవరో క్షుద్ర పూజలు చేసినట్లు అటుగా వెళుతున్న కాపరులు గుర్తించి స్థానికులకు తెలియజేయడంతో చుట్టు పక్కల గ్రామాలకు చెందిన వారు భయాందోళనకు గురవుతున్నారు.